గడించినదానికి రెండింతలు గుడించడములో బిపినుకిశోరి పేరెక్కుటచే 'వానికేమి? నోటిలో బంగారపు గరిటెతో పుట్టేడు' యని వ్యవహరింపబడుట వాడుకయయ్యెను. ప్రత్యక్షనిదర్శనముగ తాను పుట్టినింట చాలాకాలము వుండలేకపోయెను.

బిపినుకిశోరి ముచ్చట మూటగట్టినట్లుండును; బహుసున్నితుడు; గానవిద్యలో పొడిపంటివాడు, కాని వ్యవహారములో తెలివితేటలు శూన్యము; జగన్నాధరథచక్రములుమాదిరి తన జీవయాత్రలో ఈడ్వబడుచుండెను. తన పుట్టుకతోనే పెట్టిపుట్టబడిన నాపటాటోపజీవితమును నిలువబెట్టుకొనలేకపోయెను.

రాజచిత్తరంజను తనయాస్తి ఆమండలన్యాయస్థానములో గెలిచినవాడై ఒక ఎమెచ్యూర్ నాటకం కంపెనీ ఏర్పాటుచేయుటకు నుద్యుక్తుడైయుండెను. అదృష్టవశాత్తు బిపినుకిశోరియొక్క నిమీలితనయనములు, మనోహరగానము చిత్తరంజనును నాకర్షించుటచే వానియొక్క నాటకంకంపెనీలో నొకసభ్యుడుగ బిపిను ప్రవేశించెను. రాజాచిత్తరంజను బి. ఎ. చదివెను; మితిమీఱియుండలేదు. ధనికులబిడ్డయైనను నియమితస్థలములలో నియమితవేళలందు భుజించి పరుండుచుండెను. కాని బిపినును మూచేటప్పటికి నతనిసొగసుయంతయు రాజును యప్రమత్తుచేయుచుండెను; వికాసము రంజిల్లుచుండెను. బిపినుతో మాట్లాడునపుడును, వాని సంగీతములో నిమగ్నుడైనప్పుడును చిత్తరంజనుని భోజనాలు చల్లారుచుండెను; రాత్రి మితిమీఱుచుండెను.

రాణిబసంతకుమారి భర్తమీద భ్రమజెందినపుడు "ఏమిటిది? కోతిమనిషితోటేనా ఎప్పుడు ఆడుకోడము"అని విసుగుకుంటూయుండెడిది.ఎంతశీఘ్రముగ బిపిను తనభర్తనుంచివెడలిపోవునో నంత సుఖముపొందేది రాణి. ఈవిధమైన యసూయతకు రాజు మనమునందుల్లాసముపొందుచుండెను. రాజు నవ్వి యీభూమిమీద యాడువాండ్రకు ఒక్కటే తెలుసును—వారుప్రేమించినవారు; ఇంకొకరు ఎలాగుపోయేది వారికి అక్కరలేదు. ఇతరులందు మిక్కిలి గణనాతీతమైన గుణములున్నను నవి వాళ్ళమందర యెడారులే. పెండ్లిసమయమందు పెళ్ళాంచెవులో ఏదోగొణిగే మొగుడుతప్ప ఇతరులెవ్వరు మంచివారుకారు. భోజనానికి భర్త కొంచెము ఆలస్యమయిన ప్రపంచము తిరుగబడుతుంది; యింకొకడికి నోటికి ఒక్కముద్దయైనలేదన్న చెవిటివారు అగుదురు. స్త్రీజాతికి ఇట్టిపక్షపాతముండుట తప్పయెన్నవలసినను, చిత్తరంజనున కది నవ్వు వచ్చేది. అప్పుడప్పుడు రాజా రాణివద్దకూర్చుని బిపినునుగురించి యతిశయోక్తిగస్తుతిస్తుంటే తన పెళ్ళానికి తలకొచ్చిన అరికాలుమంటయును, గద్దించిమాట్లాడుటయును జూచుచు నవ్వుకొనుచుండెను.

ఏదైతే రాజారాణులకు వింతవస్తువయినదో యది బిపినుకు చావుయయ్యెను. ఇంటి నౌకర్లు రాణి మాట్లాడు యాకనికరములేని మాటలనందుకొని బిపినును చాలాసార్లు పస్తుచేయుచుండిరి. వానికి చేయుచుండిన నుపచారములు మానివేసిరి; వానికి మనస్తాపము, నిర్నిద్రమెండుఅయ్యెను. ఒకరోజున రాణి పుటోయను వానితో "ఏరా! నీకు తీరుబాటేలేదా? రోజంతా ఏమిచేస్తున్నావు?"యనియన్నది. "అమ్మా! ఏమి చెయ్యాము? రాజాగారి యాజ్ఞలప్రకారము ఆబిపినుగారికి సేవచేయుచుంటిమి"యని వాడునత్తెను.

అంత రాణి "ఏం? బిపినుబాబు నీకు నవాబురా? ఇకచాలు"అని గర్జించెను. పుటో ఈమాటలు అందుకొని మఱుచటిదినమునుంచే బిపిను నుద్దేశించడములేదు; అతని భోజనసదుపాయములందు నిర్లక్ష్యముచేయుచుండెను. ఎన్నడైనను నలవాటులేనివాడగుటచే బిపిను తాను తిన్నకంచాలు తోముకొనవలసి వచ్చినపుడు తోముకోలేక తఱచుపస్తుయుండెడివాడు. కాని యీసంగతి రాజు కెంతమాత్రము దెలియనీయకూడదనుకొనెను. నౌకరుతో తగవులాటకు మనస్సొప్పలేదు. అంతయు మంచిగనే భావించుకొనుచుండెను. ఈవిధ

మున రాజుకు ప్రేమానురాగము మెండగుచుండ రాణికి కోపము యసూయత వృద్ధిపొందిపొంది భరింపలేక పోయెను. ఇట్లుండగ "సుభద్రాహరణము" నాటకము వేసిరి. హాలంతయు ప్రేక్షకులతో క్రిక్కిరిసియుండెను. రాజు, "కృష్ణుడు"; బిపిను, "అర్జునుడు" పాత్రలు ధరించిరి. "హా! హా!! ఏమిగానమాధుర్యము, ఏమికళానైపుణ్యము, ఎంతమనోహరముగవున్నది"అను ప్రేక్షకుల హాహారవములు మిన్నుముట్టెను.

ఆటయయిపోయినది; రాజు రాణివద్దకువచ్చి "ఏలాగున్నది?" అని అనెను. "నిశ్చయముగ బిపిను అర్జునునిపాత్ర బలేనేర్పుగఒప్పించినాడు. గొప్పవాళ్ళవిత్తనమది. వర్ణనాతీతముగనున్నది" అని రాణియంటే రాజునవ్వుచు, "మరి నేనెలావున్నాను? నావేషము అందముగలేదా?"అని యడిగెను. అంత "ఓ! మీది యింకోవిషయము"అని యనుచు, బిపినుకిశోరియొక్క నాట్య, గాన కళానిపుణతను మెచ్చుకొనుచుండెను.

అటుఉన్నసూర్యుడిటుతిరిగెను; బల్లలుతిరుగబడెను. ప్రేమించినవాడు అసూయతజెందసాగెను. ఎంత కాలమైన బిపినులోనిమగ్నుడైనరాజు ఇప్పుడు "ఆలోచనలేనివారు బిపినుగురించి యింత స్తుతిగీతము పాడుతారుగదా! వాడిముఖము, పాట ఏమి అందముగనున్నవి"యని యనెను. ఒక్కక్షణంక్రితంవరకు బిపినంటే కొట్టుకుపోయే రాజుకు ఇప్పుడిప్పుడే తెలివితేటలు వచ్చుచున్నవి!

ఆమఱుచటిరోజునుంచే బిపినుకు కావలసిన యావత్తుసౌకర్యములు తమంతట తామే వచ్చుచుండెను. "బిపినుబాబును ఇంతవరకు ఏదోనాకర్లతో సమంగాఉంచుచున్నాము; అదిచాలాతప్పుపని మనకు"అని రాణి రాజుతోఅనెను. సంకుచితుడై తనమనస్సు చివుక్కుమనునట్లు "హా!"యని ఆప్రసంగమును ఇంకొకదానిలోనికి ఆరాజుమార్చినాడు. "ఈసంవత్సరముతొలకరికి మళ్ళీయింకొకసారి ఈనాటకంవేయాలి" యని రాణి అంటే రాజు వినుపించుకొనెను—వినుపించుకోలేదు.

ఒకనాడు వానిబట్ట సరిగఉంచనందున రాజు పుటీనుద్దేశించి చివాట్లుపెట్టగ "ఏం? బాబూ! అమ్మగారి యాజ్ఞలపై బిపినును సదాయనుసరించుచున్నాము."అని యంటే రాజు అతిచీదరపడి "ఛీ! ఏరా, బిపిను నీకు నవాబురా? చూస్తాను; వాడికంచాలు వాడు కడుక్కోలేడు? వాడిపని వాడు చేసుకోలేడా? ఏమిటిరా వాడిదర్జా?"యని యనెను. ఇదేఊతముగ పుటో నిర్లక్ష్యించగ బిపిను యథాదౌర్భాగ్యముగనెను.

రాణి బిపినుపాటలు బహుమెచ్చుకొనుచుండెను. రుచిగఉన్నవి. లాభముకోసము చెప్పడముకాదు. సాయంసమయమందు రాజు, బిపినులు సంగీతముపాడుచుంటే రాణి ప్రక్కగది తెరగుండవిని సంతోషించెడిది. ఇప్పుడు రాజు నియమితవేళలందు భుజించుచుండెను. సాయంకాలవినోదములు విరమించెను.

జమీందారి వ్యవహారాలు రాజుమధ్యాహ్నపువేళ చూచుకొనుచుండెను. ఒకరోజున వాని జనానాకు త్వరగవెళ్ళగ తనభార్య ఏదోచదువుచున్నట్లు జూచెను. "ఏమిటి?"అని అడిగేటప్పటికి రాణికొంచెము వెనుకకుతగ్గింది కాని "బిపిను పాటలుకొన్ని నేనునడుపుకుంటూయున్నాను. హఠాత్తుగ సంగీతముమీదమీకు దృష్టిమాంద్యమయినది"యని తక్షణమే జవాబిచ్చెను. పాపము! ఆమెయెగదా రాజుయొక్క శ్రద్ధ పాడుచేసినది. తెల్లవాఱినది; రాజు బిపినును నుద్యోగమునుండి మాన్పించెను.—ఎక్కడికిపోవును? ఏమిచేయును? ఏమీఆలోచనలేదు. బిపినుకు ఇదివక్కటేనావిచారము. రాజు తను గాఢస్నేహితులే! జీతం డబ్బులు గురించికాదుకాని రాజుయెడలకుదిరిన ప్రేమవల్లనే వానికి సేవచేసెను. ఎంత దీర్ఘాలోచనచేసినను తనను లేవకొట్టుటకు కారణంతెలియడములేదు. అంతాక్రొత్త! "కర్మ!; అంతానాకర్మ!!" యని బిపిను యనుకొనెను. ఒక్క దీర్ఘనిశ్వాసమువిడచి, తనవాద్యమునుబుచ్చుకొని, పుటీచేతిలో రెండుపైసాలుపెట్టి, వెళ్ళిపోయేడు—ఎక్కడకో వెళ్లిపోయేడు; "స్నేహితుడా!" యనిపిలువని యావిశ్వప్రపంచములోనికి.

—రవీంద్రుడు.